69707
4|2|87

# ఆశాప్రియ

మన జీవితమంతా కలలు కంటూ కూర్చోవడమేననీ, తీయని కలలన్నీ యవ్వనంలోనే కంటామనీ, అంచేత జీవితంలోని మాధుర్యం అంతా యౌవనంలోనే వుందనీ ఎవరైనా అంటే వారితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను; కాని యీ కలలేవీ యథార్థాలు కావు. పాతకలల్ని స్మరించుకుంటూ బ్రతకాల్సిందే అని అంటే మాత్రం నేను ఖండిస్తాను. కల యథార్థమవుతుందని నేను రుజువు చేసుకున్నాను. నిదర్శనం యిస్తాను.

నా యువక స్వప్నాలకు ఆద్యంతాలు ఆశాప్రియ. ఆమె నా ఊహా విశ్వానికి కేంద్రం; హృదయానికి నాలుగో పరిమాణం; నా వునికికి కారకురాలు; నిద్రకు కన్నీటితో తడిసిన తలగడదిండు; వొక్క కన్నీటి బిందువును, శాస్త్రజ్ఞుడు పరిశోధిస్తే అందులో ఆశాప్రియ అణువులు దొరుకుతాయి; ఆ పరమాణువుల వింతకలయిక నా స్వప్నం.

ఆశాప్రియను జీవితంలో ఎప్పుడైనా ఒక్కసారి చూడగలనా ? చూడగలిగితే, కల యథార్థమై, యథార్థమే కలవుతుంది.

తెల్లటి మల్లుబట్టమీద ఎన్నో దర్శనాలిచ్చింది ఆశాప్రియ భక్తురాలిగా రుక్మిణిపాత్రతో, దేవుడంటే గురిలేని నాకు భక్తివిశ్వాసాలు నేర్పింది. విరహిణిగా దమయంతి పాత్రతో, నాకు బ్రహ్మచర్యం రాసిపెట్టింది. 'వన్సుమోర్'లో కాలేజిగరల్ వేషంతో నాకు పిచ్చెక్కిపోయింది. ఇన్నింటిలో ఏది ఆమె నిజస్వరూపం ? 'ఎవరనీ నిర్ణయించేదిరా ?' ఏ అవయవానికా అవయవం విడివిడిగా చూపినా, మొత్తంగా అన్నీ కలిపి చూపినా, ఆమె ప్రచారంచేసిన సౌందర్యం అనే మతంలో, నాస్తికుడిని రెచ్చగొట్టే లోపాలు లేవు. కనురెప్ప పైకి లేస్తే, విశ్వం విప్పారుకుని, తారకలను మెరిసేటట్టు చేసే తల్లివెలుగులో కేంద్రీకృతమైన శక్తిని ప్రదర్శించినట్లుగా వుంటుంది. కాఠిన్యానికి కొలతబద్దలలాంటి సన్నటి క్రూరమైన పెదవులు- కాని నోరు

విప్పితే, పళ్ళవరసలో కరుణరసం వుజ్వలంగా కదుల్తుంది. ఆ నవ్వును తల్చుకుంటే నా కేడుపొస్తుంది. ఆమె దుఃఖిస్తే, తెరంతా తడిసిపోయి, తుదిచిత్రం పడదేమో ననిపించేది. ఆమెను చూసిన కళ్ళతో బైటికొచ్చి-స్త్రీలకేసి చూస్తే- యీ మనుషులందరూ వొకేజాతివారేనా అన్న అనుమానం బాధించేది. నా చుట్టూ ఆశాప్రియ- మరోకొత్త ప్రపంచం అల్లింది. ఆ ప్రపంచంలో మేమిద్దరమే తప్ప యింకెవ్వరూ వుండరు; అప్పుడప్పుడు పక్కవేషాలు తొంగిచూస్తాయి. కాని వాటికి మా ప్రపంచపు నిశ్చలత్వాన్ని కలవరపెట్టే చాంచల్యం లేదు. తోకచుక్కలా వెలిగిపోతుంటాయి.

నా కలలు వర్ణించను. వర్ణించేశక్తి నాకులేదు; కొత్త మచ్చుచూపమన్నా, చూపే ధైర్యంకూడా లేదు. అంతేకాదు, వర్ణించే అవసరం లేదు. మీరు ఆశాప్రియను చూసివుంటే- మీరూ నాలా యౌవనంలోవుంటే- మీవీ నావీ వొకే కలలు.

బి. ఏ. ప్యాసై- వుద్యోగంలేక యింట్లో కూర్చున్న రోజులవి. ఆశాప్రియను వూహించుకోవడమే నా కాలక్షేపం. చంద్రుణ్ణిచూసి యీ చంద్రుడే ఆశాప్రియపై వెన్నెల కురిపిస్తాడని సంతోషించేవాణ్ణి. మేమిద్దరం- వొకేదేశంలో వున్నాం. వొకేభాష మాట్లాడతాం; వొకే గాలి పీలుస్తాం; తప్పకుండా ఎప్పుడో చనిపోతాం. ఎన్నింట్లో సమానం! ఎంత దగ్గర!!

'చంచల' వారపత్రిక సంపాదకుణ్ణి మా భావయ్య ఎరుగును. నాకా పత్రికలో వుద్యోగం యిప్పించాడు. జీతం ఎనభై. పట్నంలో వుండాలి. అందుకని వొప్పుకున్నాను. ఆశాప్రియనుగూడా చూడొచ్చు.

నా అభిరుచి తెలుసుకుని సంపాదకుడు సినిమాపుట నాకు అప్పగించాడు. ఆశాప్రియ నటించిన కొత్త చిత్రం 'స్వప్న జగత్తు' విడుదలయింది. పోషకులకోసం ప్రత్యేకంగా వొక 'షో' వేశారు. మా పత్రిక తరఫున నేనూ వెళ్ళాను. చిత్రంలో పాల్గొన్నవారందరూ చూడ్డానికొచ్చారు. ఆశాప్రియ మాత్రం రాలేదు. ఆనాడే, ఆ చిత్రంలో దాసీకన్యగా చిన్న వేషం వేసిన అనూరాధను చూడ్డం జరిగింది. నాముందరే కూర్చుంది; ఛాయ నలుపు- ఎంతో కళైన మొహం; లోపలి శక్తులన్నీ బైటకొచ్చే

మార్గం లేక లోలోపల దహించుకుపోయి నలుపైనట్లుంటుంది. చూడగానే మళ్ళా మళ్ళా చూడాలనిపించదు. పరిచితులకు ఓపికతో పరిశీలిస్తే- క్రమంగా వ్యక్తమయ్యే అందం ఆమెది. అసలది అందంకూడా కాదు: చీకటి అందంగా వుండదు; నక్షత్రాల నిర్మలత్వాన్ని అందంగా రుజువు చేస్తుంది; లోయలో వున్నవారికే శిఖరాల అందం; అట్లాంటిదీ అనూరాధ.

చిత్రం అంతలోనూ ఆమె పది పదిహేనునిమిషాలు మాత్రం వస్తుంది. ఆ కాస్సేపటిలోనూ- ఆమెకు భవిష్యత్తు వుందని నేను తేల్చుకున్నాను. ఆమె నటనలో 'నేను గొప్పగా నటిస్తున్నాను' అన్న చైతన్యం లేదు. ప్రేక్షకులు కుర్చీలలో బిగిసికూర్చుని శ్వాసను ఆపుచేసుకోరు. తమకే తెలీకుండా ఆమె మెత్తగా వత్తిడి కలిగించి, వాతావరణాన్ని విస్ఫుటంచేసి- సముద్రం విడిపోయి మళ్ళా కలుసుకున్నట్లు జారిపోతుంది. 'షో' ముగిసింది. అనూరాధను అభినందించి మెచ్చుకున్నాను. ఆమె ఆశ్చర్యంతో ఏమీ మాట్లాడలేకపోయింది. 'వచ్చేవారం చంచల చదవండి— కాదు, చదువు ఏం ?' అన్నాను. దిగులుగా నవ్వి వెళ్ళిపోయింది.

ఆరోజల్లా ఆమెను ఎందుకు 'అండి' అని సంబోధించలేకపోయానో తర్కించుకున్నా; పురుషుడు ఆధిక్యతను ప్రకటించుకోడమా? యౌవనాన్ని, చనువుతో అభినందించడమా ? లేక నా తలబిరుసా ?

చంచలలో స్వప్నజగత్తును గురించి వ్రాస్తూ- వ్యాసంలో మూడొంతులు అనూరాధను మెచ్చుకోడానికి వినియోగించాను. 'ఈ చిత్రం చూసి సిగ్గుతో తలొంచుకుని బైటకొచ్చాను. ఇలాంటి చిత్రాలు- ఆంధ్ర దేశానికే అవమానం. మనవారి తెలివితక్కువతనాన్ని- యీ చిత్రం చాటినంత స్పష్టంగా మరేచిత్రమూ చాటదు. ప్రతీది మన మంచికే అన్నారు పెద్దలు. ఈ చిత్రంలో గొప్ప భవిష్యత్తుగల తారను చూపించారు నిర్మాతలు. అందుకు వారినీ, యీ చిత్రాన్నీ క్షమించొచ్చు."

మా సంపాదకునికి తెలియపర్చకుండా వ్యాసంలో యిలాంటి వాక్యాలు దొర్లించాను. చూసుకుని నన్ను చివాట్లు పెట్టాడాయన. ఆత్మను చంపుకుని ఎట్లా అబద్ధాలు వ్రాయమన్నారని అడిగాను. ఆయన నవ్వాడు.

"ప్రధానపాత్రలమీద నీకేదో పగ వున్నట్లు వ్రాశావు. అనామకులు-

అనామకమైన పాత్రల్ని మెచ్చుకుంటారు కాబోలు!" అని నవ్వుతూ అన్నా నన్నామాట చాలా బాధించింది. ఆశాప్రియ ఆనాడు కనపడలేదని నా కసి, పగ యీ వ్యాసంలో వెళ్ళగక్కాను అనేటంతటి దగ్గరగా వున్నాయి మా సంపాదకుని మందలింపు మాటలు.

తరవాత కొన్నిరోజులకు తారలతో పరిచయం అని ఒక శీర్షిక ఏర్పాటుచేశాడు సంపాదకుడు. ఆశాప్రియతో ఇంటర్వ్యూ భారం నామీద నేనే పడేసుకున్నాను. ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో వల్లించుకుంటూ రాత్రంతా నిద్రేపోలేదు.

ఆశాప్రియ బంగ్లాదగ్గరకెళ్ళి వరండాలో కుర్చీమీద కూర్చున్నాను. లోపల్నించి నలుగురైదుగురు వరసగావచ్చి నన్ను చూసి వెళ్ళడం సాగించారు. పోలికల్ని బట్టి వీరికీ ఆశాప్రియకూ వున్న బంధుత్వం వూహించలేకపోయాను. ఐదుగురిలో యిద్దరు పిల్లలు. ఎవరిపిల్లలో! ఆమె వుంటున్నది మేడమీది వాటాలోనట. లేచి వెనకవైపు మెట్లమీది నుంచి మేడమీదకు వెళ్ళాను. తలుపుతట్టాను. తలుపు తీశారు. లోపలికెళ్ళి హాల్లో సోఫాలో కూర్చున్నాను. మూడు కుర్చీలు, మూల గుండ్రటిబల్ల, తివాచీమీద వీణ. గోడమీద సినిమా చిత్రపటాలు, బల్లమీద వారంక్రితంది తెలుగు వార్తాపత్రిక వున్నాయి. పత్రికలో మొదటిపుటమీద 'స్వప్నజగత్తు' చిత్రం ఎడ్వర్టైజ్మెంటును బట్టి యిది ఆశాప్రియ యిల్లేనని నిశ్చయించుకున్నాను. కాకపోతే నేనెందుకు అక్కడుంటాను?

తలుపుతీసినామెవరో? వెనుకభాగంమాత్రం కనిపించింది. లోపలివార్ని ఆకర్షించడానికి సకిలించాను, అవలించి చిటికవేశాను. గుమ్మంవెనక నిలబడి "ఎవరండీ?" అని పలకరించినామె 'అనూరాధ'. ఇద్దరం ఆశ్చర్యంగా కళ్ళతో పరిచయం చేసుకున్నాం.

"మీరా!"

"........?"

కాసేపు నిశ్శబ్దం

"మీరు.... మద్రాసు యిక్కడే వుంటున్నావా?.... వుంటున్నారా?" అన్నాను తప్పులు దిద్దుకుంటూ. అనూరాధ నిండుగా నవ్వింది.

"అవును. నువ్వు అంటే తప్పులేదులెండి" అన్నదీ కాని నాకు నమ్మకం కుదరలేదు. నన్ను ఆమె యిదివర్లో ఎరుగునట. నేను మూడేండ్ల క్రితం వేసవిలో, మా బాబయ్యగారి వూర్లో గడిపినప్పుడు ఆమె నన్ను చూసిందట! సోడాకొట్టు నరసయ్య చెల్లెలట! నేనూ చాలాసార్లు ఆమెను చూశానట. ఒకసారి సోడా తాగి చిల్లర లేకపోతే "తరవాత యిద్దురు లెండి" అన్నదట. ఆ సోడా డబ్బులు యింకా బాకీయే. ఆమె పిన్నమ్మకి ఆశాప్రియతో పరిచయమట. పట్టుపట్టి సినిమాలో జేర్పించిందట. అంచేత తనూ ఆశాప్రియతోనే వుంది.

"ఆశాప్రియను గురించి అంతా చెప్పు" అన్నాను ధైర్యంగా మాట్లాడుతూ.

"ఎందుకు ?"

విషయం చెప్పాను.

"నా విషయం రాయకూడదా ఏం ?" అందీ.

"ఎందుకు వ్రాయకూడదూ ? మొన్న నేను వ్రాసిందంతా నిన్ను గురించే. ముందు ప్రధాన తారలు" అన్నాను.

"ఓహో, అలాగా.... మీరు వ్రాసింది ఆశ చదివింది" నా సంతోషానికి మేరలేదు. ఆ వ్యాసంలో ఆశాప్రియకు అన్యాయం జరిగిందీ. తనను మెచ్చుకోలేదు సరిగదా, తను దయదల్చి 'ఎక్స్ట్రా' వేషం యిప్పించిన 'అనూ'ను మెచ్చుకోవడమా ? నేనీ తెలివితక్కువ వ్రాతలు ఎందుకు వ్రాశానా అనిపించింది. కాని ఎక్కడికక్కడే తృప్తి. ప్రస్తుతం అనూరాధ సంతోషించింది కదా !

"ముందేదో పెద్దగా చేసే సూచన లున్నాయనీ, భవిష్యత్తుందనీ వ్రాశారు కదా- అంటే యిప్పుడేమీ లేనట్లేగా ?" అనేసింది.

"ఉందీ. అంటే, యింకా బాగా నటించి పైకొచ్చే సూచనలు" అన్నాను. చమత్కారానికి నన్ను నేను అభినందించుకుంటూ, నాకేవో బోలెడు ప్రశ్నలడగాలనుందీ సమయానికి వొక్కటీరాదు. "నిన్ను గురించి చెప్పు" అంటే చెప్పిందిగా. నా కెలాంటి విషయాలను గురించి సమాధానం కావాలో నాకు తెలీదు.

"ఆవిడేరీ ?"

అనూరాధ ఎఱ్ఱచీర కొంగులో కిలకిల నవ్వింది. నవ్వడాని కేముంది ? "ఎందుకు నవ్వు ? తప్పా ?"

"ఆవిడేరీ అంటే నవ్వొచ్చింది. ఏదీ అనలేదని- అంటే మనిషిని అనుకున్నారా ?" యింకా నవ్వుతోంది. శంకలూ, అనుమానాలూ లేని స్త్రీ మనస్సును చూసి అసూయపడ్డాను. అర్థం లేకపోయినా, ఏదో వున్నట్టు మహా ! నేనూ నవ్వేశాను.

"మీ వాళ్ళు యింకెవ్వరూ లేరా ?" అని అడిగాను. ఈ ప్రశ్న కూడా స్ఫుటంగా లేదని తెల్సు. ఏం చెయ్యను ?

"మీరు ఆశను యింటర్వ్యూ చెయ్యడాని కొచ్చారు. నన్నడుగుతారేం ?"

"నువ్వు యింగ్లీషు చదువుకున్నావా ?" అన్నాను. 'ఇంటర్వ్యూ' అన్నమాటను బాగా ఉచ్చరించటం చూసి.

"మీకెట్లా కనిపిస్తోంది ?" అని అనూరాధ కొంటెగా నవ్వుతోంది. స్త్రీ మనస్సు నే ననుకున్నంత అమాయకం కాదేమో !

ఇంతలో కారు హారన్ వీధిలో మోగింది. అనూరాధ ఛివాలున వెళ్ళి మెట్లతలుపులు తీసింది. ఆశాప్రియ మెట్లపైనుంచి గబగబా గదిలో కెళ్ళింది. వెనుక డ్రైవర్ కాబోలు, రెండుమూడు పాకేజిలు తెచ్చి, అనూరాధకిచ్చి దిగివెళ్ళాడు. అతను వెళ్ళగానే, మరో లాల్చీ, కండువా వేసుకున్న వ్యక్తి తిన్నగా లోపలికొచ్చి నాముందుగా ఓ కుర్చీలో కూర్చున్నాడు.

ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదీ నిమిషాలు గడిచాయి. ఆయనా, నేనూ మాట్లాడుకోలేదు. ఆయన బల్లమీది పత్రికను తీసి చదవటం అభినయించాడు. నేను గోడమీది పటాలను, ఏ చిత్రంలోనివో పోల్చుకోడం మొదలెట్టాను.

పదినిమిషాలు గడవగానే ఆశాప్రియ అలంకరించుకుని చక్కా వచ్చింది. ఒక పర్వతం, తనమీద అకస్మికంగా చెట్లు మొలిపించుకుని, చెట్లమీద ఆకులు, పూలు, కాయలతో సంధ్యకు ఎఱ్ఱగా పండి కదిలి

వొచ్చినట్లనిపించింది. అంటే అంత లావుగా వుందనికాదుస్మాండి. కళ్ళను చూడనీకండా చేసే ఒక పెద్దవెలుగు. మెదడును ఆలోచించనీకుండా చేసే ఒక మహత్తర శక్తి ఆమెముందు చైతన్యం లేకుండా సంపూర్ణంగా జీవించడం జరుగుతుంది. పర్వతశిఖరం కేసి చూస్తే, మన అల్పత్వం తెలిసొస్తుంది ఎర్రగా మంటలాంటి చీర, తుఫానుకు చెల రేగిన సముద్రంలా ఎన్ని మడతలో! చీకటి, తలంటుకున్నట్లు షాంపూతో బిద్దకించి, మందగించి, బిగిసి కూర్చున్న పెద్దజడ నేను మొహంకేసి చూడలేదు. సిగ్గేసింది. నే నెవణ్ణి? ఆమె సినిమా తారని తెలీకపోతే, నిర్భయంగా చూద్దును. మొహం నలుపని నిర్ణయిద్దును. సంసారపక్షమైన చీరా రెవికా కట్టబెట్టి, మూల కూర్చోబెడితే, మళ్ళా చూడ్డానికి యత్నించను. తెరపై సౌందర్యం, కలలో మాధుర్యం, అన్నీ ఆమెకు నేనే ఆపాదించిన తర్వాత, సాధారణవ్యక్తిలా ఎలా కనబడుతుంది ?

ఆశాప్రియ ఫ్రేముకుర్చీ వెనక్కి లాక్కుని, దర్జాగా కూర్చుంది. ఫ్రేము సంతోషంతో మూలిగింది. ఆ రెండోవ్యక్తి చేతులు నలుపుకుంటూ, నాకేసి చూసి ఏడుస్తూ నవ్వి, లేచి నిలబడి, కూర్చుని, మళ్ళాలేచి, తల వూపి, వెళ్ళొస్తానని వెళ్లాడు. నాకూ ఆ గతిపట్టకుండా కుర్చీని బిగించి పట్టుకొన్నాను.

"ఆయన్ని ఎరుగుదురా? చాలా మంచివాడు. రోజూ ఓసారి నన్ను చూడకుండా వుండలేడంట. వచ్చి చూసిపోతుంటాడు. ఏమీ మాట్లాడడు" అన్నది ఆశాప్రియ.

"మూగాడా ?"

"నయం. అనుకున్నవాళ్ళే మూగాళ్ళు. మాట్లాడేందుకేమీ లేదంటాడు. లక్షాధికారి. మీ పత్రికల ఆఫీసుల్ని ఓ వంద కొనిపారేస్తాడు."

"నే నెవర్నో మీ కెట్లా తెలుసు ?"

"బాగుందే, సంపాదకుడు ఉత్తరం వ్రాశాడుగా?"

"వచ్చింది నేననీ, మరొకరు కారనీ మీకెట్లా తెలుసు ? బోలెడు మంది వచ్చిపోతుంటారు గదా!"

"అయేంమాటలు. అడ్డమైనవాళ్ళూ ఎందుకొచ్చిపోతుంటారు? సినిమావాళ్ళకి నీతీ జాతీ లేవనుకున్నావా? రోజూ మీ పత్రికలవాళ్ళే చీదపురుగులల్లే గుమ్మాల్ని పట్టుకు వేళ్ళాడుతుంటారు. ఆమధ్య వొకాయన నొచ్చాడు. జుట్టునెరిసిందీ...."

చెప్పలేక ఆశాప్రియ నవ్వుకుంటోంది. ఫేముకుర్చీ లయగా మూల్గుతోంది.

"జ్ఞాపకం వుందా 'అన్నీ'— అసలు పనేమిటో చెప్పక నన్ను పెండ్లిచేసుకుంటానంటూ కూర్చున్నాడు. అద్దాలబీరువాలో పెట్టి పూజిస్తాడుట.... మేఘాల్లోనే కాని, నేలమీద అడుగెట్టనివ్వడంట. యింకా, ఏమిటేమిటో చెప్పాడు. నేను నవ్వడం, ఆయన ఏడవటం. ఎందుకో తెలుసా? ఆయనకి పెళ్ళాం, పిల్లలూ వున్నారు" విపరీతంగా ఆశాప్రియ నవ్వుతోంది. నీతిగా ప్రవర్తించడం అంటే, ఆమెకు చాలా గురి కాబోలు.

"అందులో ఆశ్చర్యం ఏముంది? ఈ రోజుల్లో భార్యాపిల్లలు వున్నవాళ్ళే ప్రేమించి మళ్ళా పెళ్ళి చేసుకుంటున్నారు. ఎందుకంటే, ప్రేమించి పోషించేటందుకు తగినంత స్థితిమంతులై వుంటారు. పైగా మొదటిపెళ్ళి ఎవరో చేసింది, తర్వాతదీ తను చేసుకున్నదీ."

"నీ ధోరణి చూస్తే ఆయనా, నువ్వూ ఒకే ఆఫీస్‌లో వుంటున్నట్లుందే. నీకు పెండ్లయిందా?"

లేదని తల పంకించాను.

"అయితే అట్టేసేపు నీతో మాట్లాడకూడదు. సమయం చూసుకుని నన్ను పెళ్ళాడతా నంటావు" అని, తల వెనక్కి వేళ్ళాడేసి, పట్టుతప్పి నవ్వుతోంది. చీరమడతలు, పల్లంలోకి పడిన కెరటంలా దిగజారాయి. రొమ్ములు శిఖరాల్లా బలంగా, ఠీవిగా జాకెట్టును బిగించి పారవేస్తున్నాయి. ఫేముకుర్చీ సంతోషంతో ఏడ్చింది.

"మీరనుకున్నంత చెడ్డవాళ్ళు కారు, మొగాళ్ళు" అన్నాను ధైర్యం తెచ్చుకుని.

"చెడ్డవాళ్ళయితే ప్రమాదమే లేదు. నేను బాగా నటిస్తానంటారు గాని, నిజంగా నటించేది నా పిక్చర్సు చూచి నన్ను మెచ్చుకునేవాళ్ళే" అన్నదీ కొంచెం తేరుకుని.

"అయితే వాళ్ళు మెచ్చుకోవటం ముహస్తుతి అంటారా ?"

"ఉత్తరాల్లో కూడా అదే ఏడుపు. రోజూ ఒక వంద వుత్తరాలొస్తాయి. అందులో తొంభైతొమ్మిదిమంది నన్ను పెళ్ళాడతానేవారే!"

"రాసినవాళ్ళు మీరన్నట్లు బాగా నటిస్తారు; వారన్నట్లు మీరు బాగా నటిస్తున్నారు; అంచేత పెండ్లి చేసుకుందామని వ్రాస్తున్నారు. అందులో తప్పేముంది ?"

"తప్పేముందా ? వాళ్ళందర్నీ జైల్లో పెట్టించాలి. సినిమాతారలంటే అంత లోకువైపోయింది. ఇహనుంచి మా డైరెక్టరుగారి సలహా ప్రకారం, తుపాకితో దరవాన్‌ని గుమ్మం దగ్గర నిలబెడతా."

"నీతిని బంధించలేరు. ఉత్తరాలు వస్తూనే వుంటాయి."

"వాటిని తగలబెడతాను."

"అన్యాయం. అందులో అవసరమయినవి కూడా వుండొచ్చు. ఉదాహరణకు మా సంపాదకుని ఉత్తరం లేకపోతే మరో చిత్రానికి కాంట్రాక్టు ఫారం."

"కాంట్రాక్టులు పోస్టులోవచ్చే రోజులు వెళ్ళిపోయాయి. చచ్చినట్లు యిక్కడికి రావాల్సిందే."

"ఎట్లాగొస్తారు ? దరవాన్ తుపాకీతో కాల్చిచంపుతే !" అన్నాను.

ఆశాప్రియ స్వచ్ఛంగా నవ్వింది.

"అనీ! ఆ పత్రిక ఇలా పట్రా" అని కేకేసింది. అనూరాధ పత్రిక తెచ్చింది.

"ఇదీ రాసింది నువ్వేనా ?" అని పత్రికను మడిచి నాముందు పడేసింది.

"అవును" అన్నాను.

"నీకు కళ్ళున్నాయా ?"

"డైరెక్టరుగారు ప్రేక్షకులందరికీ ఓ రకమైన కళ్ళజోడు టిక్కెట్‌తో సహా యివ్వమన్నారేమోగాని నావి నా కళ్ళే."

"అబ్బో ! తెలివే! ఆ చిత్రం చూసి మెచ్చుకుని పెళ్ళాడతామని వచ్చిన వేల ఉత్తరాలు ?"

"అది విమర్శకాదు, ఆత్మహత్య" అన్నాను.

"సంతోషించాంలే! నువ్వొక్కడివే బైలుదేరావు విమర్శకుడివి, అణాకానీ పత్రికలో వ్రాయడానికి. దయచెయ్యి." ఆశాప్రియ నేత్రాలు ఆగ్రహంతో గుండ్రంగా తిరిగిపోతున్నాయి. పెదవుల చివర్లు చదరంగా వణుకుతున్నాయి.

"క్షమించండి ! మా పత్రిక సాలుచందా తొమ్మిది రూపాయలు. విడిప్రతి మూడణాలు- అణాకానీ కాదు" అన్నాను నమ్రతలో ఉద్భవించిన గర్వంతో.

అనూరాధ లోపల్నుంచి నవ్వేసింది. ఆశాప్రియ నవ్వక తప్పింది కాదు. నవ్వినందుకు తనమీద తనకి కోపం వచ్చింది.

"మిమ్మల్ని గురించి చెప్పండి" అన్నాను.

"నన్ను గురించి నీకంతా తెలుసు- విమర్శ రాశావుగా అన్నది."

"అది కాదు, మీ స్వీయచరిత్ర."

"నాకేం స్వీయా, అసూయా లేవు. వెళ్ళండి, రెస్టు తీసుకుని మళ్ళా షూటింగ్ కెళ్ళాలి."

"పోనీ, ఎప్పుడు వీలో చెప్పండి, మళ్ళా వస్తాను" అన్నాను.

"చూద్దాంలెండి. అవన్నీ చెప్పలేను."

ఆశాప్రియ లేచింది. ఫ్రేముకుర్చీ నిట్టూర్చింది. నేనూ లేచాను. గుమ్మంకేసి నడిచాను. రెండడుగులు వెనక్కి వేశాను.

"ఏం ?" అంది ఆశాప్రియ.

"ఏం లేదు. అంటే మళ్ళా రేపు కాదు, వెళ్లొస్తానని. అంటే వెళ్ళొస్తానంటే మళ్లా రేపన్నమాట" అన్నాను తడబడుతూ.

"రేపు నేను కోలాపూర్ వెళుతున్నా."

"మీ యిల్లు, ఫర్నీచర్ బాగున్నాయి" అన్నాను.

"ఇది మా యిల్లు కాదు. మా మేడ యింకా నా స్వాధీనం కాలేదు. కోర్టులో వుంది."

"అన్నీ వున్నాయి మీ యింట్లో; ఒక్క పుస్తకాల బీరువాతప్ప. పుస్తకాలు గృహానికి శీలం యిస్తాయి" అన్నాను కాలేజీలో చదువుకున్న ఒక వ్యాసం స్మరించుకుని.

"అక్కర్లేదులెండి. ప్లీడర్ల యిళ్ళల్లో పదేసి పుస్తకాల బీరువా లుంటాయి బూజుపట్టి."

"వాటిని చూసే క్లెయింట్లు వస్తారు."

"నాకోసం ఎవ్వరూ రానక్కర్లేదు."

"మా పత్రికలవాళ్ళు కూడానా ?"

"వాళ్ళని అసలు గుమ్మం తొక్కనివ్వను."

"వాళ్ళే నిజంగా మీ మేలు కోరేది. మనను విమర్శించే వాళ్ళు శత్రువులు లేకపోతే మనలో చాలామందికి పేరు ప్రతిష్ఠలే వుండవు. వాళ్ళు అన్నది తప్పని రుజువు చేసేటందుకు బోలెడంత శ్రమపడి కృషిచేస్తాం. అదే అభివృద్ధి" అన్నాను.

"చాలా శ్రమపడ్డారు. మరి వెళ్ళండి !" ఆశాప్రియ మెత్తబడింది. తెచ్చిపెట్టుకున్న నిర్లక్ష్యం అదంతాను! దగ్గరతనం కనపరుస్తూ సూక్ష్మంగా నవ్వింది. పోనీ నా కట్లా అనిపించింది. ఆఫీసు కెళ్ళాను, జరిగినదంతా మా సంపాదకుడితో చెప్పాను. నేనేదో అసందర్భంగా అనుకుంటాననీ, అందుకని ఆమెకు కోపం వచ్చిందనీ, నన్ను పంపటం బుద్ధిపొరపాటనీ, యీసారి మరొకర్ని పంపుతానని, ఆయన తీర్మానించుకున్నాడు.

## 2

నెల గడిచింది. ఒక సాయంత్రం ఆశాప్రియను చూడ్డానికి వెళ్లాను. ఆమెను మెచ్చుకుంటూ ఒక పెద్దవ్యాసం వ్రాసి, చదివి వినిపిద్దామని తీసు కెళ్ళాను. ఆమె ఆమోదించిం తర్వాత, ఏదేనా పత్రికలో వెయ్యొచ్చు. కాని ఆశాప్రియ యింట్లోలేదు. కోలాపూర్ వెళ్లిందట.

హాల్లోకి వెళ్ళాను. అనూరాధ హార్మోనియంమీద పాడుకుంటోంది. అనూరాధను దగ్గరగా చూశాను దీపాల వెలుగులో. మనిషి నలుపే, తళుక్కుమనే నలుపు- చంద్రుడిమీద మేఘంలా. ఏ పక్కనుంచి చూసినా,

అవయవాల పొందికలో లోపంలేదు. నన్ను అనూరాధ ఆకర్షించిందని పూర్తిగా ఒప్పేసుకోటం మంచిది. ఎట్టిచీర, ఎట్టిటి మందారాలు, ఎట్టిటి బొట్టు, ఎట్టిటి పెదవులు, సంధ్యలో ఎఱుపు. ఆ దృశ్యం నే నెప్పుడూ మరచిపోలేను.

గదిలో రెండు పుస్తకాల బీరువాలు కనిపించాయి. వాటిలో ఒక దానిలో దుస్తులున్నా, పుస్తకాలు కూడా వున్నాయి. యింగ్లీషువి, తెలుగువి.

"ఆవిడకి ఇంగ్లీషు వచ్చా ?"

"రాకపోతే నేర్చుకుంటుంది."

"నీకొచ్చా ?"

"నాకు రాదు."

"ఈ పుస్తకాలన్నీ ఎందుకు ?"

అనూరాధ నవ్వింది. "చదువుకోవడానికి."

"అబ్బా, గొప్పదానవే. కాగితాలు చించి, చెవులో తిరెలుకునేందుకు కూడా, పుస్తకాలు పనికొస్తాయి తెలుసా ?" అన్నాను.

"ఆ గతి మీ పత్రికలో కాగితాలకు పడుతుంది."

"మా పత్రికంటే అంత వేళాకోళమా ?"

"మా పుస్తకాలంటే మీకంత వేళాకోళమెందుకో !"

"చదవడం రాకుండా పుస్తకాలేమిటని !"

"మీ పత్రికను మాత్రం ఎవరు చదువుతున్నారని ? పోనీ మా పుస్తకాలు, వచ్చినవాళ్ళైనా చదువుకొని కాలక్షేపం చేసేటందుకు."

పుస్తకాలను పరీక్ష చేశాను. చాలాభాగం హాలీవుడ్ ఫిలిం పత్రికలు, కొన్ని గ్రంథాలు నటన గురించి, చిలకమర్తి వారి నవల్సు, స్టేజినాటకాలు, ఫాషన్‌బుక్సు.

"ఆశాప్రియకు వయస్సెంత ?"

"మీరు చెప్పుకోండి."

"ఫిలింతారల వయస్సు నిర్ణయించడం బ్రహ్మతరమా ?"

"ప్రేక్షకుల అభిరుచులనుబట్టి నిర్ణయించొచ్చుగా."

"అట్లాగైతే నీ వయస్సు ఇరవైలోపు."

"నేను ఫిలింతారననుకొను, ఎక్స్ట్రాని."

"పోనీ, అదనంగా ఇరవై-అవునా ?"

"ఏమో! బ్రహ్మతరం కాదన్నారుగా ?"

"ఆశాప్రియకు కొంచెం పెండ్లయ్యిందా ?" అన్నాను. అనూరాధ విరగబడి నవ్వింది.

"చాలా అదృష్టవంతులు- ఆశ ఇక్కడలేదు."

"ఏం తప్పా ?"

"ఏమో, నాకేం తెల్సు ?"

"నీకయిందా ?"

"నాక్కొంచం అయింది."

"అంటే ?"

"తెరమీద"

"ఆ పెండ్లిని కొంచెం అనకూడదు. కాసేపు అనాలి."

నాకు వీరి వాతావరణం, జీవితాలు, వింతగా కనబడుతున్నాయి. ఆశకు పాతిక సంవత్సరాలైనా వుంటాయి. పెండ్లి కాలేనట్లుంది. మొగాళ్ళల్లో బ్రహ్మచార్లను వూహించొచ్చు కానీ, స్త్రీలలో వూహించడం హాస్యాస్పదంగా వుంటుంది. హాలీవుడ్‌లో నెలకో పెండ్లి చొప్పున చేసుకుంటారే మన తారలు రిటైరయింతర్వాత, ఏకంగా ఒకేసారి చేసుకుంటారు కాబోలు. అయినా మొగుడు ఎలాగా న్యూసెన్సే !

"పోనీ ఎవర్నో ఒకర్ని చేసుకుని, యిద్దరూ నాయకీ నాయకుల పాత్రలు నిర్వహిస్తూ హాయిగా వుండరాదూ ?" అని అడిగాను.

"వారికి ఇదివరకే పెండ్లయిందని తెలిస్తే ప్రేక్షకులకు చిత్రం రక్తి కట్టదు. పెండ్లికానివారు, పెండ్లయి విడిపోయినవారు ప్రేక్షకులకు వీరి చేష్టలే కావాలి. అంచేత పెండ్లి ఫిలించివర్లో జరిగినట్లు చూపిస్తారు" అంది అనూరాధ.

"అలాగే తారలు, జీవితం చివర్లో పెండ్లిచేసుకుంటారంటావు, అవునా ? నువ్వూ అంతేనా ?"

"నా విషయం వదిలెయ్యండి నేను ఎక్స్ట్రాని గా. నేను చేసుకున్నా ఎక్స్ట్రా పెండ్లంటారు."

"ఎప్పుడూ యిలాగే వుండవు. నువ్వు పెద్ద తారవవుతావు, ప్రధాన స్థానం అలంకరిస్తావు, లక్షలులక్షలు గడిస్తావు, అప్పుడు నే జ్ఞాపకం వుంటానా ?"

"నన్ను వెక్కిరించనక్కర్లేదు."

"నన్నెందుకు నమ్మవు, నా వ్యాసాలు చదివావుగా ?"

"ఆశను చులకన చేసినంతమాత్రాన నేను పెద్దదాన్నవుతానా ?"

"నాలో విశ్వాసం లేదా ?"

"సినిమా డైలాగా ?"

నాకు సిగ్గేసింది.

"ఇంతకీ మీరేం పనిమీదొచ్చారు ?"

"నేనా ?...." సమాధానం దొరకలేదు. ఎందుకొచ్చినట్లు ? ఏదో పనిమీద వచ్చాను. కాని అదేమిటో మరచిపోయాను. అనూరాధ నడిగి ఆశాప్రియ జీవితాన్ని గురించి తెలుసుకోవాలనా? ఒక స్త్రీనిగురించి మరొక స్త్రీ యథార్థమైన విషయాలు, సత్యాలు చెప్పగలదా ?"

"నేను చెప్పనా" అన్నది నవ్వుతూ అనూరాధ. 'ఏదో వంకని ఆశాప్రియను చూడాలని వచ్చారు.'

నాకిది నిజమేమో ననిపించింది. ఈ స్త్రీలు ఎట్లా కనుక్కుంటారో !

"లేదు. ఆశాప్రియ వంకని నిన్ను చూడ్డానికి వచ్చాననుకో కూడదూ ?" అన్నాను.

"ఈ మాట ఆశ వచ్చింతర్వాత చెప్పనా ?" అన్నది.

ఇంతలో కారుహారన్ చప్పుడవడం, కారు ఆగడం, సామాన్లతో డ్రయివరూ, వెనకాల ఆశాప్రియ రావడం జరిగింది. గబగబా లోపలిగదిలో కెళ్ళింది. అనూరాధను లోపలికి పిలిచింది. ఎవరికో ఏదో చెప్పిరమ్మన్నది. కార్లో వెళ్ళమంది.

"మీరూ వస్తారా ? బజార్లో దింపుతా" అన్నది అనూరాధ.

"ఆవిడ యిప్పుడే వచ్చారు, అలసిపోయింది. ఎవ్వరితోనూ మాట్లాడరు" అన్నది కన్ను మెదుపుతూ. ఇంతలో ఆశాప్రియ బైటికి వచ్చింది. ప్రయాణంలో జుట్టు కాస్తకూడ రేగలేదు. జడచుట్టూ మఫ్లర్ కట్టుకుంది. కళ్ళల్లో అలసట, మొహానికి విషాదం తాలూకు అందాన్ని ఆపాదించింది.

"మళ్ళా ఎందుకొచ్చారు? నేనేమీ మాట్లాడలేను వెళ్ళండి" అన్నది.

"వెడతాను. క్రితంసారి వచ్చినప్పుడు గేటుదగ్గర కాపలావాణ్ణి పెడతానన్నారు. అంతకంటే ఒక కుక్కని పెంచితే మంచిదనుకుంటాను. ఎవరన్నా కొత్తవారు రాగానే మొరుగుతుంది" అన్నాను ఏదో మాట్లాడా లనుకొని.

"కొత్తవాళ్ళెందుకొస్తారు? యిదేమన్నా సత్రమనుకున్నారా? ప్రతివాడూ రావటం, నాచేత వాగించడం, అసందర్భపు వ్రాతలు వ్రాయడం జరుగుతోంది. దయగా మంచిగా వుండకూడదనుకుంటాను.

"అందుకోసం అనటంలేదు. హాలీవుడ్‌లో ప్రతి ఫిలింస్టారూ కుక్కనో, కోతినో, అడివిపిల్లినో పెంచుతారు. వాటిద్వారా వాళ్ళకు కొంత ప్రచారంకూడా జరుగుతుంది. వాళ్ళ ఫొటోలతోపాటు వాటి ఫొటోలుకూడా ప్రకటిస్తారు" అన్నాను.

ఆశకు కోపం వచ్చినట్లుంది.

"నాకు కుక్కపిల్లద్వారా ప్రచారంకావాల్సిన ఖర్మమేం పట్టింది? ఏక్ట్రెస్ కానివాళ్ళకు ఆ గతి."

అనూరాధ బైలుదేరమని సంజ్ఞ చేసింది.

లేచాను. మెట్లదాకా వెళ్ళాను.

ఆశాప్రియ తలుపు వెయ్యడానికి వెనకాలే వచ్చింది.

మెట్లుదిగుతూ అన్నాను. "అంటే నే చెప్పిన హాలీవుడ్ తారలు పెండ్లికానివాళ్ళు. పెండ్లికాగానే భర్తద్వారా వారికెలాసూ బోలెడంత ప్రచారం జరుగుతుందిలెండి" అని వచ్చేశాను.

కార్లో నేను అనూరాధకు దగ్గరగా జరగడం ఆమె దూరంగా జరగడం జరిగింది. కారు నిల్చిపోయింది. నన్ను దిగమంది. శుంఠలాగా దిగి నడిచిపోయాను.

నే వుంటున్న పెద్దమేడలో వున్నవారందరం మేడ ఖాళీచెయ్యాలని, కలెక్టర్ దగ్గరనుంచి ఉత్తరుపైంది.... యజమాని ఆక్రమణకోసం అందరూ వెళ్ళారు. నా స్నేహితుడు కూడా మరోగది చూసుకున్నాడు. నే నొక్కడినీ ముందు గదిలో వుంటున్నాను. స్నేహితునిగది మరీ చిన్నది. మరో పెద్దగది దొరికేవరకూ మేమిద్దరం కలసివుండటం జరగదు. రెండురోజుల వ్యవధి వుంది ఖాళీచెయ్యడానికి. గదికోసం వెదుకుతున్నాం. దొరకలేదు. ఉదయం కాఫీహోటలునుంచి మా మేడదగ్గర గదిలోకొచ్చి తాళం తీశారు. రోడ్డుమీద రెండులారీలు నిలిచాయి. నలుగు రైదుగురు, వాటిలోసామాను దించి మేడమీదికి ఫిరాయిస్తున్నారు యజమాని సామాను. నేనెక్కడి కెళ్ళను ? యజమానితోచెప్పి బ్రతిమాలితే మరో గది దొరికేవరకూ వుండనిస్తాడేమో ! సామాను దించేసి లారీలు వెళ్ళిపోయాయి. మరోగంటలో మరోకారు నిలిచింది. అందులోంచి అనూరాధ, ఆశాప్రియ, కుక్కపిల్ల దిగారు. వాళ్ళను చూడగానే కిటికీతలుపులు మూపేసి, ఓ మూలగా కూర్చున్నాను. ఆశాప్రియ తలుపులు తెరుచుకుని, నా గదిలోకే వచ్చింది.

"మీ రిక్కడి కెందుకొచ్చారు ? నా మేడను గురించి పత్రికలో వ్రాస్తారా కొంపతీసి—ఇస్సు ఇస్సు" అన్నది. కుక్కపిల్ల మొఱుగుతూ నాచుట్టూ తిరగడం మొదలెట్టింది. దాన్ని ఎత్తుకుని వూరుకోపెడుతూ దువ్వుతోంది.

"ఇది మీ మేడేనా ?" అన్నాను ఆశ్చర్యంతో.

"అవును, ఇన్నాళ్ళకు నా స్వాధీనంలో కొచ్చింది.... బాగుందా ? అరవై వేలైంది."

"నేనీ గదిలో కాపురం వుంటున్నాను."

"ఆ సంగతి యీ సిగరెట్టు ముక్కలు చెబుతూనే వున్నాయి" అన్నది.

"గదివూడ్చేది రావడం మానేసింది. నన్నిక్కడ మరో వారంపాటు వుండనిస్తారా ?" అన్నాను.

"ఇంకానయం! పేరు ప్రతిష్ఠలతో బ్రతకటం మీకిష్టంలేనట్లుందే. అలా వీల్లేదు, వెంటనే ఖాళీ చెయ్యండి."

"నేనుంటే మీ పేరు ప్రతిష్ట లెలాపోతాయి ?" అన్నాను.

"అమ్మో తెలిస్తే! నలుగురూ ఏమనుకుంటారు ?" అన్నది వింతగా కళ్ళు పెద్దవిచేసి తిప్పేస్తూ.

"మరీ చిత్రంగా వుంది. వందమందిలో వెయ్యిదీపాల మధ్య, అనేకమంది మొగాళ్ళతో నటిస్తే, చూసి హర్షించే నలుగురూ, అద్దెకి గది దొరకక, అల్లల్లాడే ఒక అభాగ్యుణ్ని మీ గదిలో వుండనిస్తే హర్షించరూ ? పైగా పాపం, ఎంతమంచిదో వుండనిచ్చింది, అని చెప్పుకుంటారుకూడా." అన్నాను.

"అది వేరే విషయం, అట్లా కుదరదు."

నాకోపం వచ్చింది.

"మీకు పెండ్లి జరిగివుంటే నాకీ గతి పట్టకపోను. మీరు కాకపోతే, మీ వారైనా దయదల్చి నన్నిక్కడ వుండనిద్దురు" అన్నాను.

"అవన్నీ మీ కనవసరం."

"అంటే మొగాళ్ళది జాలిగుండె— మీకే కనక వివాహమై వుంటే, మీరు మీ యింటిని స్వాధీనం చేసుకోవడం కోసం యింత అవస్థపడి వుందురా ? ఇంగ్లీషు సినిమాతారలు పెండ్లికాకుండా ఎవ్వరూలేరు. ఎందుకంటారు ? ఇంటి వ్యవహారాలు చక్కబెట్టుకోడానికన్నమాట పైగా, ఆలోచించండి సంఘంలో గౌరవం, స్వేచ్ఛ, మర్యాద. మీకు పెండ్లయివుంటే నన్నిక్కడనుంచి యింత కఠినంగా వెళ్ళిపొమ్మంటారా ?"

"దగ్గర్లో వుండి యింకా పిచ్చిరాతలు వ్రాద్దామనా? తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం చాలకనా....?"

నేను పైకి చూచాను.

"మీ యింటి కెక్కడా వాసాలులేవు.... అంతా కొత్త పద్ధతిలో కట్టించారు"

విసుక్కుని, కోపంగా నవ్వేసి వెళ్ళింది ఆశాప్రియ.

నేను ఆ ముందుగదిలోనే వుంటూ వచ్చాను. ఆశాప్రియ నన్ను వెళ్ళిపొమ్మని గట్టిగా అనలేకపోయింది. నేను ఆమెతో మాట్లాడే అవకాశాలు కూడా తగ్గిపొయ్యాయి. ఎవరెవరో వచ్చిపోతూ వుండేవారు. అసలు చూడ్డమే పడేదికాదు. ఎప్పుడైనా అనూరాధ కనబడి, అర్థమైందానికి మల్లే నవ్వి వెళ్ళిపోతుండేది. నాకేదో స్వప్నంలా వుండేది. అక్కడుండ బట్టి కాబోలు, నాకు నేనొక భాగ్యవంతునిలాగ కనబడేవాడిని. చుట్టుపక్కల వ్యక్తులు నన్నొక కథానాయకునిలా ఎంచడం మొదలెట్టారు. నా స్నేహం కోరేవారు కొందరు నన్ను ఆశాప్రియ ప్రైవేట్ సెక్రటరీగా భావించి, ఫిల్ములో ఏదేనా 'ఛాన్సు' ఇప్పించమని అడుగుతూ వచ్చారు. నేను వారి భ్రాంతులను భగ్నం చెయ్యలేదు కూడా. నాలో నేను నవ్వుకునే వాణ్ణి.

నెల గడిచింది. ఒకరోజు పత్రికలో ఆశాప్రియ పెండ్లి చేసుకుంటోందన్న వార్త పడింది. నేనాశ్చర్యపడ్డాను. సన్నాహాలు జరిగి పోతున్నాయి. ఆహ్వానాలు వెడుతున్నాయి. కాబోయే భర్తపేరు ఎవరో హయగ్రీవరావట. చాలా డబ్బు గలవాడు. చదువుకున్నవాడు. తనూ ఫిలిం పరిశ్రమలో దిగి, వుద్ధరించడానికి కంకణం కట్టుకున్నాడట. అసలత నెవరు ? ఆమె పరిచయం ఎట్లా కలిగింది ? ప్రేమించిందా ? డబ్బు కోసమా ? కొందరు నాపేరు అడగడం కూడా జరిగింది. నేను కాదని తేలింతర్వాత నిట్టూర్చారు.

అనూరాధ ద్వారా నాకు కొన్ని ఆహ్వానపత్రాలు చేరాయి. వాటిని, నేను వారికీ వీరికీ యివ్వాలిట. ఏమిటో కాదనలేకపోయాను. ఎల్లుండి పెండ్లనగా, ఆశాప్రియ సాయంత్రం ఆరింటికి, కార్లోంచి దిగి నా గదిలో కొచ్చింది. మేడమీదికి తనతో రమ్మంది. వెళ్ళాను. హాల్లో కూర్చున్నాను. ఇప్పుడే వస్తా వుండమని, ఆమె వెళ్ళిపోయింది. హాల్లో ఫర్నిచర్, అద్దాలు, దీపాలు అవన్నీ చూస్తే నా కళ్ళు గిర్రున తిరిగిపోయాయి.

కుక్కపిల్ల కాసేపు మొరిగి, విసుగెట్టి ఓ సోఫాలో కూర్చుంది. అద్దాలలో నా మొహం చూసుకుంటే సిగ్గేసింది. మొహం తిప్పేశాను. ఎటుచూసినా అద్దాలే! అంత అందమైన వాతావరణంలో, నేనొక కళంకంగా కన బడ్డాను. ఆ వాతావరణంలో, హయగ్రీవరావును వూహించాను. ఎవరు? ఎట్లా వుంటాడు?

ఆశాప్రియకు మొగుడే? అసలు ఆశాప్రియను ఏ ఒక్కరి సొత్తు గానో వూహించడం నా వల్లకాదు. తాజ్‌మహల్, కాంచన్ గంగాశిఖరం, నయగరా జలపాతం— వీటిలా ఆమె ఒక సామ్యవాద సంస్థ.

తలుపుతీసి, ఆశాప్రియ తీగలా వ్యాపించింది. పల్చటి తెల్లచీర. ప్రపంచమాయపై తెరదించినట్లు, శిఖరాల్ని మేఘాలు బంధించినట్లు, మధ్య నిశ్శబ్దం తారకల్ని కట్టిపడేసినట్లు, తెల్లచీర శరీర లావణ్యాన్ని సిగ్గుతో బహిరంగపరిచింది. వింత పరిమళంతో నాకు వూపిరాడటంలేదు. చీకటి తెల్లగా కనబడే అనుభవం అది.

"ఎలాగున్నాయి!" అని ఓ డజను చీరలు బల్లమీద ప్రదర్శిం చింది?

నేనేం మాట్లాడను?

తన గాజులు చూపించింది. రవ్వలదిద్దులు చూపించింది! నాకు మతిపోయింది. ఎందుకో కుక్క మొరిగింది. చటుక్కున తేరుకున్నాను.

"పెండ్లి విషయం ఎప్పుడూ అనుకోలేదు!" అన్నాను. ఎందుకలా అడిగానో నాకే తెలీదు.

"సగం గొడవ వదుల్తుందిగా" అన్నది.

"అంటే?"

"ఎవరాయన?"

"హయగ్రీవంగారు చాలా మంచివారు. ఎన్నాళ్ళనుంచో నా కోసం యిదవుతున్నారు, కాదనలేకపోయాను."

ఆశ్చర్యం వేసింది. ఎవడో కోరితే కాదనలేని మహాత్యాగి నంటుందేం?

"ఇంకా ఎందరో యిదవుతున్నారుగా" అన్నాను.

"నీకూ్కడా ఏదన్నా కొంచం భ్రముందా ఏం ?" అని కొంటెగా నవ్వుతూ, నా బుగ్గను మెలిపెట్టి సాగదీసింది.

# 3

అనుకోని ఆనందంతో వణికిపోతున్నా సునాయాసంగా గడ్డిపోచను తుంచిపారేసినట్లు, తమలపాకును మడిచినట్లు, శ్వాస విడిచినట్లు, ఆశాప్రియ నా మొహాన్ని తన చేతుల్లోకి యీడ్చి అధరాలతో నా నోటిని నొక్కివేసింది. కొండలు రబ్బరులా సాగినట్లు, ప్రవాహం గడ్డకట్టినట్లు, సంధ్యలోని ఎరుపు మొహాల కొట్టిన విధంగా, పన్నీరులో ముంచి చంపిన విధంగా.... ఏదో ఆట్లాంటి అనుభవంలో గిల గిల తన్నుకొని బ్రతికి బయటపడ్డాను. తళతళ మెరిసే కత్తి కాల్పు- అగ్నిపర్వతం పగిలి మంచు వెదజిల్లినట్లు.

అదంతా నాకోసం కాదన్న చైతన్యం నాకు లేకపోలేదు. అంతా హయగ్రీవంకోసం అని నేననను. అది, సంభవింపనున్న అనుభవం తెల్సుకొని, ఆ సంతోషాన్ని నామీద ద్రవింపచేసే చిహ్నపు చేష్టలని నాకు తెలుసు. ఆ జ్వాల దేన్నో కాల్చాలి. ఆ జల దేన్నో ముంచివేయాలి. ఆ అఘాతం దేన్నో మింగివేయాలి. నేను దొరికాను ఆ సమయానికి.

ద్రాక్షతో తనే 'డ్రింక్' తయారుచేసి తీసుకొచ్చింది.

"ఏం ? సంతోషించవేం ?" అని అడిగింది.

నోరు మూసుకున్నాను.

"తృప్తిలేదు నీకు అందరూ అంతే."

ఛీ ! ఛీ ! అనుకున్నాను.

"సర్దాగా వుండవేం ?" అన్నది.

ఏం చెప్పను ? బుద్ధుడు, టాల్‌స్టాయ్, గాంధీ స్మరణ కొచ్చారు.

"కృతజ్ఞుణ్ని" అన్నాను ఎందుకో.

"అబ్బో !" అన్నది వెటకారంగా.

ఇంతలో కారు బుర్రుమన్నది. కుక్క మొరిగింది,

"అనూరాధేదీ ?" అన్నాను,

"వచ్చింది అదే."

"నే వెళ్ళనా ?"

"వెళ్ళక!" అని మొహం వెనక్కి వేలాడేసి, నిండుగా నవ్వింది. ఆశాప్రియ మనిషిలా లేదు. ఒక పికాసో చిత్రం.

*           *           *           *

పెండ్లి మహావైభవంగా జరిగింది. ఎన్ని దీపాలో, ఎన్ని కార్లో, ఎందరు జనమో, ఎంతటి అందమో, నేనెన్నడూ మరచిపోను. గాన కచ్చేరీలు, నాట్యప్రదర్శనలు, లౌడ్ స్పీకర్లు, కెమెరాలు, పూలదండలు, బహుమానాలు, టీ పార్టీలు, డిన్నర్లు, వింతదుస్తులు, స్త్రీల వంకర తిరిగిన సౌందర్యం, ప్రాచీన గ్రీసులో పార్క్ ఫేర్‌లా ఉన్నది. హరప్పా నాగరికత గ్రంథంలోనుంచి విడదీసిన అద్భుత పుట. అది ఒక్క ఆశాప్రియ పెండ్లి మాత్రమే కాదు, అందరి పెండ్లీ. దాని కంతటికీ నేను బాధ్యుణ్ణనీ, సూత్రధారుణ్ణనీ, ఎందుకో స్ఫురించింది. కాని ముహూర్తం వేళ నే నక్కడ లేను.

తోరణాలలో ఆకులు రాలుతున్నాయి. కారు హారన్‌ల ధ్వనులు దూరంగా వెళ్ళి సన్నగిల్లుతున్నాయి, నవ్వులు కేరింతలు, దిగ్భ్రమలు, పల్చబడ్డాయి; దీపాల కాంతులు తగ్గుతున్నాయి; కింద చినిగిన 'మెను' కాగితాలు, కార్యక్రమం సూచించే పత్రాలు, నలిగిన పూలరేకులు, సిగరెట్ ముక్కలు, మిగిలిన కేక్ కోసం చీమలవేట. వానకు కరిగిపోతున్న జోళ్ళ జాడలు, నక్షత్రానికీ నక్షత్రానికి మధ్యవుండే చీకటి, ఆకాశమంతా వ్యాపించడంలాగున్నది.

రాత్రి ఎనిమిదైంది. నే నప్పుడు హోటల్లో భోజనం చేసి గదికొచ్చాను. పనిచేసే కుర్రాడు పైకి రమ్మంటున్నారని తీసుకెళ్ళాడు. హాల్లో మూడు బీరువాల నిండా పెండ్లి బహుమతులు ప్రదర్శింపబడి వున్నాయి. ఆశాప్రియ వాటి తాళాలు తీసి పరీక్షించమన్నది. ఏదేది ఎవరెవరిచ్చినారో చెప్పుకోమని. నేను చెప్పలేనని ఒప్పుకున్న తర్వాత తనే వర్ణించింది.

"అన్నిటిలోకి యిది బాగుందికదూ ?" అంటూ ఒక వెండివృక్షాన్ని పైకితీసి బల్లమీద నిలబెట్టింది. నాలుగడుగుల ఎత్తు వృక్షమది.

"ఇదేమిటి చెప్పుకో."

"చెట్టు."

"ఏం చెట్టు ?"

"ఆకుల చెట్టు."

"తెలివైనవాడవే. బంగారం కాయలు చూడు! అక్కడక్కడ బంగారపు పండ్లు వ్రేలాడుతున్నాయి!"

"ఇది కల్పతరువు హరిగారిచ్చారు. నా నెక్స్టు పిక్చర్ 'కల్ప తరువు' సగర్వంగా అన్నది."

"దర్శకు డెవరు ?"

"ఇద్దరు: హరిగారు, మావారు." సిగ్గు అభినయించింది, తెర మీదలా!

"పేరు చెప్పండి" అని నేను నవ్వాను.

కాసేపు నిశ్శబ్దం.

"తారాగణం ఎవరు ? అనూరాధ వుందా!" అని అడిగాను.

"దాని కేదో వేషం వుంటుంది. పోనీ ఎక్స్‌ట్రాగా ఎలాగా కావాలిగా! రేపు మే మందరం పూనా వెడుతున్నాం" అన్నది.

"చాలా సంతోషం."

"మేం వెళ్ళిపోవడం నీ కిష్టమా ? అవును. గదంతా హాయిగా వాడుకోవచ్చు. అవునా ?" అన్నది.

"అబ్బే, మీకా అనుమానం వుంటే రేపే ఖాళీ చేస్తాను. మీరు పెండ్లి చేసుకుని సుఖంగా ఉండగలిగినందుకు సంతోషం" అన్నాను. అవి సర్ది వేశాను.

"సుఖంగా వుండలేనని నీ కెందుకు తట్టిందో ?"

"ఏదో అనేశాను. సంతోషం ప్రకటించడం తప్పయితే క్షమాపణ వేడుకుంటున్నాను."

ఆశాప్రియ నవ్వింది.

"నీతో ఏదొచ్చినా చిక్కే" అన్నది.

"కల్పతరువులో నాయకు డెవరు ?"

"చెప్పుకో! పెద్ద క్రిటిక్‌విగా."

"క్రిటిక్‌నేగాని జ్యోతిష్కుణ్ణి కానుగా."

"మావారే" అన్నది.

"కథ?"

"నాలుగు నెలల్లో చూస్తావుగా."

హయగ్రీవరావు హీరోగా నటించబోతున్న చిత్రం ఎట్లా వుంటుందో వూహించడం ఎవరితరం! మీసాలు, లోతు కళ్ళు, వరదలకు గట్లు తెగినట్టుగా పైకి ఎగబ్రాకుతున్న క్రాపింగు, ఒడ్డు, పొడుగు, సిల్కు పంచె, గూడకట్టు, బెదరిన గుర్రంలాంటి నడక, అవన్నీ వూహిస్తున్నాను.

"వారు పాడతారా?"

"ప్లేబాక్."

"సాంఘిక చిత్రమేనా?"

"ఓ!- భార్య కల్పతరువు. ఏది పడితే అది భర్త సుఖానికి యిచ్చివేస్తుంది. ఆ భార్య— నా వేషం" అన్నది.

"పిల్లల్ని కూడా యిస్తుందా, కల్పతరువు?" అన్నాను.

ఆశాప్రియ నవ్వింది.

"ఒద్దు బాబూ. పాడుపిల్లలు- పిల్లలు పీకులాట, పితలాటం."

"నే ననేది, చిత్రంలో."

"అదా!.... ఏమో, కథంతా జ్ఞాపకం లేదు—"

"మీవారిచ్చిన బహుమానం ఏది వీటిల్లో?" అన్నాను.

"ఆ బహుమానం మాటకేం గాని, నీ బహుమానం ఏదీ?" అని అడిగింది.

చిన్నబుచ్చుకున్నాను. వెండి బహుమానం యిచ్చే తాహతు నాకు లేనందుకు విచారించాను. నా స్థితి తనకు తెలుసు. ఐనా నా దగ్గరనుంచి ఏదేనా రాబట్టుకోవాలన్న ఆశయం, నా కాశ్చర్యం కలుగజేసింది.

"నా బహుమానం, మీ గది ఖాళీ చెయ్యడం" అన్నాను.

ఇంతలో హయగ్రీవరావు, మరి యిద్దరు వ్యక్తులు, అనూరాధ వచ్చారు.

నన్ను పత్రికల వ్యక్తిక్రింద, ఆశాప్రియ భర్తకు పరిచయం చేసింది. ఆయన తల పంకించాడు.

"ఈ పెండ్లితో పత్రికల సేల్సు ఒక నెలవరకూ పెరుగుతాయి.... కాని, దయచేసి మా ఫొటోలు, రంగుల్తో మాత్రం మీ పత్రికలో ప్రకటించకండి." అన్నారాయన. ఇప్పుడెవడు ప్రకటిస్తున్నాడు? ఏమిటా స్వాతిశయం.... అనుకుంటున్నా, కోటుజేబులోనుంచి ఓ పత్రిక నా మీద పడేసి, "చూడండి," అన్నాడు. అది ఆశాప్రియ పెండ్లిసమయం ఫొటో. ఆశాప్రియ చిత్రం పడింది. ప్రక్కన భర్త చిత్రంలో, సగభాగం పోయింది. "మిగతాసగం వచ్చేవారం పత్రికలో చూడండి. సం." అని వున్నది. అందరం ఒకటే నవ్వుకున్నాం.

"ఆ మిగతా సగం మా దాంట్లో వెయ్యించనా ?"

మళ్లా అందరూ నవ్వారు. వారంతా సినిమాకు ప్రయాణమయ్యారు. నన్నెవ్వరూ రమ్మనలేదు. నేను గదిలోకెళ్ళి పడుకోడానికి యత్నించాను.

* * * *

ఆరుమాసాలు గడిచాయి. కల్పతరువు విడుదల చేశారు. ఆ చిత్రాన్ని పత్రికలు మెచ్చుకున్నాయి. మిగతావారు చెప్పని విషయం ఒక్కటి మాత్రం మా 'చంచల' చెప్పింది. చిత్రం ప్రారంభంలో ఆశాప్రియ సన్నగా, నాజూకుగా వుండి, చివరిభాగంలో లావెక్కిందనీ, తొందర్లో ఆ చిత్రం పూర్తిచేసివుంటే, యీ వ్యత్యాసం కనబడకపోననీ సూచించింది. కాని యీ వ్యాసం వ్రాసింది నేను మాత్రంకాదు. 'చంచల' సమీక్ష, అనూరాధను పొగిడింది. అనూరాధే నాయికపాత్ర ధరించి వుంటే, యింకా బాగుండునేమోనని తేల్చింది. ఇది జరిగిన నెలకే అనూరాధకు మరో చిత్రంలో ప్రధానభూమిక దొరికింది. వేరే యిల్లు తీసుకొని అందులోకి వెళ్ళిపోయింది. మా సంపాదకుడికి మంచి ఇల్లు దొరకడంచేత, ఆఫీసుగది ఖాళీచేసి, భార్యా పిల్లల్ని తెచ్చుకుని, కొత్తయింట్లో కాపురంపెట్టి, ఆ ఖాళీ గదిలో నన్నుండమన్నాడు. నేను ఆశాప్రియ గది ఖాళీ చెయ్యడానికి నిశ్చయించుకున్నాను. బండితెచ్చి సామానులు అందులో పెట్టాను. వెళ్ళబోతున్నాను. ఆశాప్రియ పైకి పిలిచింది.

"నేను లావయ్యాను. కదూ ?"

"నేను చిన్నప్పుడు సన్నంగా వున్నవాళ్ళను మెచ్చుకునేవాణ్ణి. కాని యిప్పుడు సన్నంగా వున్నవాళ్ళను చూస్తే రోతపుడుతుంది.... హాస్పటల్ ఎక్స్‌రేలు జ్ఞాపకం వస్తాయి" అన్నాను.

"ఐతే, మీ పత్రికలో యిలా వ్రాశావేం ?"

"నేను వ్రాయలేదు."

"మరి ఎవరిదీ యీ పని ?"

"నేను సంపాదకుణ్ని అడగలేదు" అన్నాను.

"దొంగపని చేసినవాడల్లే గదెందుకు ఖాళీ చేస్తున్నావు ?"

"ఎప్పుడో ఒకప్పుడు ఖాళీ చేయాల్సిందేగా. పైగా మీ కిబ్బంది."

"అనూరాధా, నువ్వూ కూడబలుక్కున్నారా ?"

"ఆవిడ ఒక పెద్ద తారైంది.... నే నిలాగే వున్నాను. కూడ బలుక్కునేటందుకు మాకేముంది ? నేను మా ఆఫీసుకి పోతున్నాను."

వెళ్ళిపోయాను.

* * * *

నా జీతం నూటపాతిక చేశారు. మా వాళ్ళు, సంబంధాలు చాలా వస్తున్నాయనీ, నన్ను వచ్చి చూచుకోవల్సిందనీ వ్రాస్తే వెళ్ళి, రెండు మూడు సంబంధాలు చూశాక నచ్చకపోతే, చక్కా వచ్చేసాను. నాకెట్లాంటి భార్య కావాలో అందరు యువకులలాగే నేను నిర్ణయించుకోలేక పోతున్నాను. చదువా, చక్కదనమా, తెలివితేటలా, డబ్బా, పెద్దకుటుంబమా, పలుకుబడా— వీటిల్లో ఏం కావాలి ? ఈ జాబితాలో లక్షణాలు నాలోలేవని తెలిస్తే ఏం ప్రయోజనం ? తెరపై చిత్రాలూ, ఆశాప్రియా, అనూరాధా, నా దృష్టిని తలక్రిందులు చేశాయి.

ఇట్లే రోజులూ, వారాలూ గడిచిపోయాయి. మా సంపాదకుడు 'చంచల' వార్షికోత్సవం తలపెట్టి సన్నాహాలు చేసి పార్టీ ఏర్పాటుచేసి, పెద్దలు పదిమందినీ ఆహ్వానించాడు. నాకూ ఓ పని కల్పించాడు. ఉదయం

ఏడింటికే ఆశాప్రియ మేడదగ్గర కెళ్ళాను. హయగ్రీవరావు మొక్కల్ని పరీక్షచేస్తూ మొహం కడుక్కుంటున్నాడు.

"ఎవరికోసం ?" అన్నాడు.

"ఆశాప్రియకోసం" అన్నాను.

"ఆమెతో.... ఎందుకు— పనేమిటో నాతో చెప్పండి." అన్నాడు నోట్లో పుల్లతీసి, వుమ్మేస్తూ.

నే పెదవి కొరుక్కున్నాను.

"నన్నెరగరా ?" అన్నాను.

ఎరగనన్నట్లు తల ఊపేడు.

"చంచల" అన్నాను.

"అంటే ?"

"పత్రిక."

"ఓహో- ఏం కావాలి ?"

"వారు లేరా ?"

"నాతో చెప్పండి."

"మా చంచల వార్షికోత్సవం ఎల్లుండి— మీరూ వారూ దయ చెయ్యాలి."

"దయచెయ్యడం అంటే వెళ్ళమని కూడా అర్థంవుంది కాదు టయ్యా !" అని నవ్వులాంటిది సాగించాడు.

"ఈ రోజుల్లో పిలవడం మర్యాదలు తెలీకనే ఆహ్వానపత్రాలు పంపడం కాదుటండీ !"

"చూద్దాం వెళ్ళండి" అన్నాడు.

నా ఒళ్ళు మండింది. ఈయనకి మానర్స్ వున్నట్లు లేదు.

"వార్ని చూసిపెడతా" అంటూ వరండాలోకెళ్ళి ఓ కుర్చీలో కూర్చు న్నాను. ఎనిమిదైంది. ఈ స్థలం, మొక్కలు, మేడా, ఎంత ఖరీదవుతాయా అని అంచనా వేస్తూ గడిపాను. ఎనిమిదిన్నరైంది. కుక్కపిల్ల నాముందు కొచ్చి ఆకస్మికంగా మొరగడం సాగించింది. నా కంఠం గుర్తుపట్టి

ఆశాప్రియ క్రిందికొస్తుందేమోనన్న ఆశతో దగ్గడం, సకిలించడం, ఆవ లించడం అభినయించాను.

"ఏయ్, అచ్చీ!" అని కేకేశాడు హయగ్రీవం, ఎవర్నుద్దేశించో— దాసీపిల్లని కాబోలు.

రెండు నిమిషాల్లో, ఆశాప్రియ కళ్ళు నులుముకుంటూ వరండాలో కొచ్చింది. వాడిలి, విడిపోయిన జడలపాయలూ, వర్షం పోగానే మేఘంలో నలుపు కలిగినట్లు, కళ్ళక్రింద జారుతున్న కాటుక, బిద్దకంవల్ల స్వాధీనం తప్పిన అవయవాల వింత కూర్పు— ఆశాప్రియ నిజస్వరూపం, ఆహ్లాదం కలిగించింది. నన్ను చూసి లోపలికెళ్ళి, మరో అరగంటకి మొహం కడుక్కుని, జుట్టు శుభ్రం చేసుకుని చక్కా వచ్చింది. కుర్రాడు కాఫీ తెచ్చాడు.

నేను విషయం చెప్పాను.

హయగ్రీవరావు వచ్చి "రావడం పడదేమో" నన్నాడు.

"ఒక నిమిషం వచ్చి టీ తీసుకురండి," అని బ్రతిమిలాడాను.

"దగ్గరగాచూసి మా లావు సన్నం వర్ణించడానికా! మేం రాం." అన్నదీ ఆశాప్రియ.

గేటుదాటి లోపలికొచ్చిన మేకను తరమడానికి హయగ్రీవరావు తోటకేసి నడిచాడు.

"పెద్దవాళ్ళయి పెళ్ళి, సంసారం, పిల్లలూ వచ్చాక, లావుకావడం అసహజంకాదు." అన్నాను.

కాసేపు నిదానించి మళ్ళా అన్నాను.

"పిల్లలుంటే, లావుగావున్నా, లావని ఎవరూ అనుకోరు కూడాను."

"ఇదివరకుకంటే లావయ్యాను కాదూ?" అంటూ తనను పరకా యించి చూచుకుంది.

"మీతోపాటు,మీ ప్రేక్షకులు కూడా పెద్దవాళ్ళయి లావవుతున్నారన్న సంగతి మరచిపోకండి. నాకిప్పుడే బాగున్నారు. బెట్టి డేవిస్‌ని చూడండి. యిద్దరు సంతానం కలిగిన తర్వాతే, ఆమె నటనలో పరిపక్వం వచ్చింది.... నిండైన మనిషి. నిండైన నటన...." అన్నాను.

"ఛీ ఛీ. పిల్లలుంటే.... పీకులాటబాబూ !"

"అట్లాంటప్పుడు లావునుగురించి బెంగపెట్టుకోకూడదు" అని లేచాను. హయగ్రీవం వచ్చాడు.

"వస్తారు కదూ ?" అన్నాను.

"చూద్దాం" అన్నాడు.

"మరో విషయం చెప్పడం మరచిపొయ్యాను- అనూరాధ నాట్యం కూడా ఏర్పాటైంది" అని నవ్వుతూ వచ్చేశాను.

## 4

'చంచల' వార్షికోత్సవం జరిగింది. అనూరాధ ఒంట్లో బాగాలేక నాట్యానికి రాలేదు. ఆశాప్రియగాని, ఆమె భర్తగాని రాలేదు. నాకు సినిమా నటీమణులతోవున్న పరిచయాన్ని మా సంపాదకుడు హేళనచేశాడు. నేను ఒక పనిమీదవెడితే ఆ పని తప్పకుండా జరగదని హామీ యివ్వచ్చు నన్నాడు. ఒకపని జరక్కుండా చూడాలని సంకల్పం వున్నప్పుడు, నన్నే పంపడం తథ్యం; అదే నా జీవితంయొక్క వుపయోగం అన్నాడు. జీతం ఎక్కువచేశాడు కాబట్టి, వాటన్నింటికీ యథావిధి సంతోషించి వూరు కున్నాను.

తరువాత ఆశాప్రియ మరాఠీ చిత్రంలో నటించడానికి బొంబాయి వెళ్ళింది. ఈలోగా అనూరాధ నటించిన 'రాజీవాసం' విడుదలైంది. ఈ చిత్రంలో అనూరాధ భవిష్యత్తు స్థిరపడి ప్రథమస్థానంలో కొచ్చింది. 'చంచల' ఒక ప్రత్యేక సంచికలో, ఆమె జీవితసంగ్రహం, చిత్రపటాలతో సహా ప్రచురించింది. అనూరాధ మేడ, కారు కొన్నది; మరో మేడ కట్టిస్తోంది. ఐదారుమాసాలు గడిచిన తర్వాత ఆ చిత్రంలో హీరోపాత్ర ధరించిన భాస్కరరావు, తనే స్వయంగా ఓ చిత్రం తీయ సంకల్పించి, సన్నాహాలు చేస్తున్నాడు. జంకారెడ్డి లక్షాధికారి. పెట్టుబడిదారుడు— సహాయదర్శకుడు వీరిరువురూ కలసి 'న్యూఢిల్లీ' అని ఒక మహోజ్జ్వల చిత్రం సంకల్పించి కెమెరావాళ్ళని ఢిల్లీపంపి కొన్ని 'షాట్లు' కూడా

తీయించారు. డబ్బు సంప్రదింపులు కుదరక కాబోలు, అనూరాధ యీ చిత్రంలో నటించనన్నది. ఆశాప్రియ మరాఠీ చిత్రం పూర్తయింది. తెలిగ్రాంయిచ్చి ఆమెను రప్పించి అడిగినంతా యిచ్చి ఒప్పించారు. షూటింగ్ ప్రారంభమైన నాలుగుమాసాలలో చిత్రం నిలిచిపోయింది. ఆశాప్రియకు అరోమాసమట.

ఆనాడు ఆదివారం; అనూరాధ నూతన గృహప్రవేశం జరిగింది. సాయంత్రం టీ పార్టీ. శ్యామసుందరి వీణావాద్యం జరుగుతూండగా, నేనూ, మా సంపాదకుడూ వెళ్ళాం. అనూరాధ స్వయంగా గేట్ లో నిలబడి అతిథుల్ని ఆహ్వానించి 'రిసీవ్' చేసుకుంటోంది. మమ్మల్నిచూసి "అబ్బో! చంచల—చలనం బైలుదేరిందే" అన్నది నవ్వుతూ. మా సంపాదకుణ్ణి పరిచయం చేశాను. "ఆ రోజున మీ పార్టీకి రాలేకపోయినందుకు నన్ను క్షమించాలి. మీరొచ్చినందుకు చాలా థ్యాంక్స్" అన్నది. మేం వెళ్ళి ఓ బల్లదగ్గర కూర్చున్నాం. ఆరైంది; రంగురంగుల దీపాలు ఒక్కసారిగా వెలిగాయి. బేబీ ముక్త నాట్యంచేస్తోండగా మా ముందునుంచి ఆశాప్రియ నడచివెళ్ళి దూరంగా ఓ బెంచీమీద కూర్చుంది. అనూరాధ ఆమెను లోపలికి తీసుకువెళ్ళింది. ఆశాప్రియ రూపంలో చాలా మార్పుంది. ముఖ్యంగా చిక్కింది; అరోమాసమైనా, అల్లా కనబడక, సన్నగా వుంది. బొంబాయి నీళ్ళో, తిండో లేక కసరత్తు ఏమన్నా చేసిందో! మా సంపాదకుడు అనూరాధ జీవిత సంగ్రహంగల ప్రత్యేక సంచికను, ఆర్టుపేపర్ది ఆమెకు సమర్పించమని చెప్పి, స్నేహితుల దగ్గర శెలవు తీసుకొని వెళ్ళాడు.

మండువాలో అనూరాధ, ఆశాప్రియ మాట్లాడుకుంటున్నారు. నేనలా వెళ్లాను.

"చేతిలో అదేమిటీ?" అన్నది అనూరాధ. "చంచల ప్రత్యేక సంచిక— సంపాదకుని అభివందనములతో" అని ఆవిడ కిచ్చాను.

"థ్యాంక్స్— అవును నన్ను గురించి వ్రాశారట. మా ఆర్టు డైరెక్టర్ చెప్పాడు. నేను పెండ్లి చేసుకోనని సూచించారట- నిజమేనా?" అన్నది.

"అదేమీలేదు. పెండ్లి, సంసారం సినిమాతార భవిష్యత్తుకు అంతరాయాలనీ, సరియైన పరిస్థితులు ఏర్పడేవరకూ అనూరాధ వివాహం చేసుకోదనీ వ్రాసినాయన ఆశించాడు. అంతే" అన్నాను.

"సరియైన పరిస్థితులు అంటే?" అని అడిగింది ఆశాప్రియ.

"చూడండి- మీ చిత్రం నిలిచిపోయింది. సంసారం అనగానే యివన్నీ వస్తుంటాయి" అన్నాను.

"ఏం? మేం మట్టుకు మనుషులంకామా?" అన్నది ఆశాప్రియ.

"కాదనను. సాధారణంగా సంఘంలో మనుషులు ఎవరి ఆనందం వారే చూచుకుంటారు. మీ పరమావధి యితరులను సంతోషపెట్టడం. అంచేత మీ ప్రత్యేక సుఖాలు కొంత త్యాగం చెయ్యాలి. హాలీవుడ్‌లో అంచేతే, సినిమాతారలు, నెలకో వివాహం చేసుకుంటారు. భర్తకావాలి, కట్టిపడుండకూడదు. అదీ వారి చిక్కు."

"భలేవారే— మాకు నీతీ నియమం లేవనుకున్నారా?" అన్నదీ ఆశాప్రియ కోపంగా.

మధ్యలో అనూరాధ అందుకుంది.

"ఆయనభిప్రాయం- సినిమాలోనూ, యింట్లోనూ వొకరే భర్త కాకూడదని." అని నవ్వింది.

"అంటే, తెరపై నటించినట్లు యింట్లో కూడా నటించడం జరక్కపోయినప్పుడు పేచీలొస్తాయి. ఆ విధంగా వివాహం, భర్త అంతరాయాలేమో" అన్నాను.

"పెండ్లి చేసుకుంటేనే, సినిమాతారపై అపవాదు లేస్తున్నారు. చేసుకోకపోతే, యింక మమ్మల్ని బ్రతకనిస్తారా?" అన్నదీ ఆశాప్రియ.

"చేసుకుంటేనే సంఘం వేసిన అపవాదుల్ని పరిగణించడం జరుగుతుంది. భర్తని పైకి, అడ్డంగా వుంచిందీ అంటారు నలుగురూను. పైగా, స్వేచ్ఛకు, వ్యక్తిత్వానికి, భర్త ఆటంకం అనక తప్పదు. భర్తతోపాటు పిల్లలు వస్తారు" అన్నాను.

"బాబోయ్! యివన్నీ వింటుంటే భయమేస్తుంది. ఇంకానయం, నేను పెండ్లి చేసుకున్నాను కాదు" అన్నది అనూరాధ.

"పెండ్లి కానివాళ్ళు కాలేదని గొప్ప—"

ఇంకా ఆశాప్రియ వాక్యం పూ_ర్తి కాకుండానే అనూరాధ లేచింది. ఎవరో కొ_త్తజనం వచ్చి, చుట్టేశారు.

"నా కార్లో మిమ్మల్ని డ్రాప్ చెయ్యమంటాను." అన్నది అనూరాధ.

"అలాగే" అని లేచాను.

*　　　*　　　*　　　*

మూడు నెలలు గడిచాయి. మరో నెలగూడా గడిచింది. ఆశాప్రియకు ఆడశిశువన్న వా_ర్త తెలిసింది. నామకరణ మహోత్సవానికి ఆహ్వాన పత్రాలొచ్చాయి. "మా పాపాయిని దీవించండి." అని ఆహ్వానంపైన, పాపాయి ఫొటో వేసివుంది. ఆ ఫొటో చూసుకుని ఎవరి పోలికో తేల్చుకోలేక పోతున్నాను. గుంటకళ్ళనుబట్టి, వాళ్ళ నాన్నపోలికే ననుకున్నాను. పుట్టగానే పోలికలు కట్టడం ఎవరితరం? ఆశాప్రియ వివాహానికి నేను బహుమానం యివ్వలేకపోయాను. ఆశాప్రియ ఆ విషయం అన్నది కూడా. ఈసారైనా పాపకు ఖరీదైన బహుమానం యివ్వాలనిపించింది. కానీ, నా దగ్గర డబ్బులేదు. ఆమె నటిస్తున్న చిత్రం 'న్యూఢిల్లీ'. అంచేత వెండి 'కుతుబ్‌మీనార్' యివ్వాలనుకున్నది. దానికి చాలా డబ్బుకావాలి. బారసాల వారంరోజుల్లో వుంది. ఏం చెయ్యను ? ఓ భావం బుర్రలో ప్రవేశించింది.

సాయంత్రం అనూరాధ యింటికెళ్ళాను. ఆమె ఎనిమిదింటికి యింటికొచ్చింది.

"విన్నావా ?" అన్నది ఆతృతగా.

"ఆ, ఆ, అందుకే వచ్చాను" అన్నాను.

"ఏమిటీ ?"

"పాపాయిని దీవించి వెళ్ళండి—" అని నవ్వాను.

అనూరాధ చిత్రంగా నవ్వింది.

"అదికాదు. మా వారికి వీడ్కోలు విందు యిస్తున్నాను. మీరూ వచ్చి, వీడ్కోలివ్వండి...." అని యింకా నవ్వుతోంది.

"నీ పెళ్ళా ?"

"పెండ్లి కావడం, భర్తకి స్వస్తిచెప్పటం జరిగాయి" అని, యింకా యింకా నవ్వుతోంది.

"ఎవరికీ తెలీదే" అని ఆశ్చర్యపడుతున్నాను. 'భర్త ఎవరు చెప్పుకో....' అన్నది అనూరాధ.

"........?"

"హయగ్రీవరావుగారు, కల్పతరువు కథానాయకుడు" అంది.

"నిజం !"

నిశ్శబ్దం.

"ఎందుకు ? ఎప్పుడు ?"

"ఈ మధ్యనే.... ఎందుకో తెలీదు, ఇద్దరికీ సరిపళ్ళేదట, విడిచి పెట్టాడట." అన్నది.

"ఆశాప్రియ విడిచిపెట్టిందా, విడిచిపెట్టబడిందా ?" అని అడిగాను.

"బాబోయ్, నీ వ్యాఖ్యానాలు నా కర్థంకావు. విషయం అదీ."

"ఇప్పుడతనేం చేస్తున్నాడు ?"

"తన షేర్లు తీసుకుపోయి స్వంతంగా మరోచిత్రం తీస్తాడట. నన్ను బుక్ చెయ్యడానికి రాయబారాలు జరుగుతున్నాయి" అన్నదీ. నేను తెల్లబోయాను.

"మరి బారసాలో ?"

"పాప చేచిక్కిన తర్వాత, బడుగు బాపదేలా.... చంచలా....?" అన్నదీ.

నేను అనూరాధ హాస్యం హర్షించే స్థితిలో లేను.

"నువ్వు నాకో సహాయం చెయ్యాలి. పాపకు బహూమానం యిద్దామనుకున్నదీ; కొంచెం డబ్బు సహాయం.... మళ్ళా యిచ్చివేస్తాను...." అన్నాను.

అనూరాధ పూరికే తెగనవ్వుతోంది.

నువ్వు మళ్ళా యిస్తానంటే నమ్మను— ఐనాయిస్తాను- తీసుకో."

నాకు అనూరాధపై కోపం వచ్చింది. కాని దిగమింగుకొని, ఆ డబ్బు తీసుకొని వచ్చేశాను.

*    *    *    *

"కుతుబ్ మీనార్" తీసుకొని ఆశాప్రియ యింటికి వెళ్ళాను. నేను వెళ్ళడం ఆలస్యమైంది. రాత్రి ఎనిమిది దాటింది. జనం అప్పుడే చూసి వెనక్కి తిరిగిపోతున్నారు; ఓ అరడజను మందిమి మిగిలాము. అనూరాధ కూడా వెళ్ళిపోయింది. ఒక పెద్ద మంచముపైన ఐదారుదిండ్లు అమర్చుకుని వాటికి జేర్లబడి ఆశాప్రియ కూర్చుంది. పాపాయి అందంగా అలంకరించ బడిన తొట్టిలో ఉన్నది.

ఆశాప్రియలో ఉత్సాహం కనబడలేదు. నీరసంగా, దిగులుగా వున్నట్లు తోచింది. పాపకేసి చూసి—

"చాలా బాగుంది.... వాళ్ళ నాన్నపోలికే" అన్నాను."

ఆశాప్రియ విషాదంగా నవ్వింది.

"నిజంగానా ?" అన్నది.

"చాలా భాగం ఆయన పోలికే.... అవును నే విన్నది నిజమేనా ?" అన్నాను.

"ఆయన పోలికే అంటే ఆయన నమ్మలేదు. ఇంక పరాయివాళ్ళేం నమ్ముతారు ?"

"నిజం ?"

"అంచేతే చెడింది."

"ఇదిగో మీ పాపకు" అని కుతుబ్ మీనార్ బల్లమీద పెట్టి ప్రదర్శించాను.

"చాలా బాగుంది—అయితే— నీ కెక్కడిది యింత డబ్బు ?"

"డబ్బుకేం" అని తప్పించేశాను.

"చెబుదూ."

"నా గడింపే—"

"కోతలు కొయ్యకు. నాలుగైదొందలు అవదూ ?

"అయింది."

"ఇంత ఖరీదైంది యిస్తే జనం ఏమనుకుంటారు ?" అన్నది.

"ఎందరెందరో బహుమతులిచ్చారు. అందరితోపాటు నేనూను. పైగా నేనిచ్చినట్లు అందరికీ ఎందుకు తెలుస్తుంది ?"

"నీ సొంతడబ్బే....?"

"అన్నమాటే. అప్పు తీసుకున్నాను."

"ఎవరి దగ్గర ?"

"చెప్పాలా ?"

"ఊఁ"

"అనూరాధ."

"నన్నడిగితే నే యివ్వనూ ?" అన్నది.

నాకు నవ్వు, కోపంకూడా వచ్చాయి. తన దగ్గర డబ్బు తీసుకొని తనకే యివ్వాలిట ?

పాపాయి యేడుస్తోంది. నేను లేవదీసి, ఆడించి ఆమె కిచ్చాను. పాపని ముద్దుపెట్టుకుంది. నా కది చేతకాదు. తటపటాయిస్తున్నాను. పాప మొహాన్ని నా మూతిమీద నొక్కింది. అందులో ఆశాప్రియను తాకినట్టయింది, సిగ్గేసింది.

"వెడతా" అన్నాను.

ఆశాప్రియ నేత్రంలో యదార్థమైన కన్నీటితడి కాంతులనీడలు ఆ సమయంలో చూశాను.

'ఊఁ' అన్నదామె.

రెండుమాసాలు గడిచిన తర్వాత మరికొన్ని చిత్రమైనవి జరిగాయి. ఆశాప్రియ కూతుర్ని వాళ్ళవూరు పంపించి వేసింది. 'న్యూఢిల్లీ' చిత్రం పూర్తిచేసింది. హయగ్రీవరావు, అనూరాధ కలిసి తీస్తున్న 'అమరజీవి' కూడా పూర్తయింది. రెండుచిత్రాలు ఒకేసారి విడుదలయ్యాయి. 'న్యూఢిల్లీ'ని

అసందర్భమైన చిత్రం అని, పత్రికలన్నీ తీవ్రంగా విమర్శించాయి; ఆ పత్రికలే 'అమరజీవి'ని మెచ్చుకుని ఆకాశానికి ఎత్తేశాయి. మరొకటి జరిగింది. అనూరాధ, హయగ్రీవరావును పెండ్లిచేసుకుంది. సినిమా ప్రపంచం విస్తుపోయింది.

ఆ వార్తతోపాటు పత్రికలన్నీ, మరో విచిత్రమైన వార్త ప్రకటించాయి. 'ఆశాప్రియ' సినిమాలనుండి విరమించి వాళ్ళ వూరు వెళ్ళిపోతుందని.

'న్యూఢిల్లీ' చిత్రంలో ఆశాప్రియ, నిజంగా గొప్పగా నటించిందనీ, అందులో ఒక కొత్త నిజాయితీ, పరిపూర్ణతా వున్నాయనీ, నేనొక్కణ్ణే అనుకున్నాను. మా 'చంచల'లో స్వయంగా 'న్యూఢిల్లీ'పై విమర్శ వ్రాసి అచ్చుకిచ్చాడు సంపాదకుడు. ఆ రాత్రి ప్రింటర్ దగ్గరనుంచి ఆ వ్యాసం లాక్కుని చదివాను. అదీకూడా యితర పత్రికల వలె, తీవ్రంగా విమర్శించింది. నేనా వ్యాసాన్ని చింపేసి, ఆశాప్రియను మెచ్చుకుంటూ మరో వ్యాసం వ్రాసి, సంపాదకుడితో చెప్పకుండా, అచ్చు వేయించాను. ఆ వ్యాసం లోని కొన్ని వాక్యాలు—

"ఆశాప్రియ యితరులకోసం తన వ్యక్తిత్వాన్ని దిగమింగుకొని నటించే నైజం కలది కాదు. ఆమె నిజమైన ఆర్టిస్టు. తన ఆనందంకోసం నటిస్తుంది. యితరుల మెప్పుకోసం కాదు. ఆమె జీవితం అట్లాంటిదే. ఆమె ఆంధ్రగ్రేటాగార్బో."

దీనికి ఫలితం, సంపాదకుడు నన్ను వుద్యోగంలోంచి తీసేశాడు.

నా కింక గడవడం కష్టం— ఇహ బిచాణా ఎత్తేసి, మావూరు పోవడానికి సిద్ధపడ్డాను. నేను వ్రాసిన వ్యాసంపడ్డ సంచిక తీసుకుని, చదివి వినిపిద్దామని ఆశాప్రియ యింటి కెళ్ళాను. ఇల్లంతా చిందరవందరగా వుంది. సామాన్లన్నీ 'పాక్' చేసి మూలగా వుంచారు. కుర్చీలు, సోఫాలు హాల్లో ఒకచోట చేరేశారు. మధ్యాహ్నము రెండు దాటింది. పనికుర్రాడు ఏవో సవరిస్తున్నాడు.

"అమ్మగారున్నారా ?"

"పరున్నారు."

"ఇదంతా ఏమిటి ?"

"అమ్మగారు సాయంత్రం మెయిలు కెడుతున్నారండి."

నేను లోపలికెళ్ళాను. అంతా నిశ్శబ్దంగా వుంది. గోడలికి అద్దాలు లేవు. గడియారం టిక్ టిక్ లేదు. కుక్క మొరుగుడు లేదు. వయలెట్ రంగు పట్టుచీర కట్టుకుని, నల్లటి జాకెట్ వేసుకుని ఆశాప్రియ కుర్చీలో కూర్చుని మొహాన్ని రెండు చేతుల్లోనూ దాచేసుకుని, దీర్ఘంగా ఆలోచిస్తోంది. నా అడుగుల సవ్వడికి తటాలున మొహం పైకెత్తింది.

"అబ్బ— హడలిపోయ్యాను—"

"దేముడనుకున్నారా ?"

"దేముడొస్తే హడలిపోవడం దేనికి పైగా నాబోటి పాపాత్ముల యిళ్ళకి దేముడొస్తాడా—" అని నవ్వింది. కాని ఆ నవ్వు కళ్ళల్లోని బరువును కదిలించలేదు.

"మీకు తెల్సా— మా కుక్క చనిపోయింది."

"అలాగా—ఎప్పుడు ?"

"నిన్న."

"ఏం ?"

"ఊరికనే."

"అయ్యో పాపం." అన్నాను: కాని సానుభూతి ఎట్లా ప్రకటించాలో తెలీడంలేదు.

"మీరు వెళ్ళిపోతున్నారటగా— ఆంధ్రదేశం విచారిస్తుంది." అన్నాను. ఆశాప్రియ నవ్వింది.

"ఆంధ్రదేశానికి అనూరాధుండి ! హయగ్రీవరావున్నాడు, నువ్వున్నావు." అన్నది వెటకారంగా,

"మీకు తెలీదనుకుంటాను. మీమీద వ్యాసం వ్రాసినందుకు నన్ను ఉద్యోగంలోంచి తొలగించారు. ఇదిగో తెచ్చాను. చదవనా ?"

"నా కిప్పు డవేవీ అక్కర్లేదు."

ఆమె లేచి అటూ ఇటూ పచార్లు చేస్తోంది.

"పోనీ మరొక్కప్పుడు చదువుకోండి."

ఆ పత్రిక ఆమె చేతికి అందిచ్చాను. దాన్ని తీసుకుని సోఫామీదికి గిరాటెట్టి నా కళ్ళలోకి తీవ్రంగా చూసింది.

"నన్ను తిట్టినందుకు నీకు ఉద్యోగం లభించింది! నన్ను మెచ్చుకున్నందుకు పోయింది."

ఏదో జ్ఞప్తికి తెచ్చుకుని లోపలికెళ్ళి మనియార్డరు ఫారం తెచ్చింది.

"నువ్వు అనూరాధకి ఎంత బాకీ ?" అన్నది.

ఫలానంత అన్నాను. బాగ్ తీసి నోట్లకట్టను బైటికితీసి పనికుర్రాడిని కేకేసి వాడికిచ్చింది. ఫారం నన్ను పూర్తి చెయ్యమంది; చేశాను. కట్టిరమ్మని కుర్రాడిని పంపింది.

"ఈ మేడ అద్దెకిస్తున్నాను; రెండొందలకు- నువ్వు ఓ గదిలో వుండి ఆ అద్దె అనుభవించు."

"ఉండి ఏం చెయ్యను ?"

"ఎవ్వరూ చదవని వ్యాసాలు వ్రాసుకో."

నాకు నవ్వొచ్చింది.

"అలా అనడం అన్యాయం. మీరు చదవలేదా!" అన్నాను.

"నిజం చెప్పినవాళ్ళు బాగుపడరు" అన్నది. నాకు దాని అంతరార్థం అప్పట్లో బోధపడలేదు.

"మీరెందుకు మానెయ్యడం ?"

"అసలు నే వెయ్యడం ఎందుకు ?"

"పదిమందీ ఆనందంకోసం అనుకుంటా."

"మానెయ్యడం నా ఆనందంకోసం అనుకో."

ఆశాప్రియ మనసిప్పి మాట్లాడగలదని నే నెప్పుడూ అనుకోలేదు. ఉద్రేకంతో కంఠం తడబడింది. కళ్ళల్లో బరువు కొండమీది నీడలా కదిలిపోయింది. జీవితంలోంచి కలలోకి మాయమవుతున్నట్లుంది.

"నన్ను చూడ్డానికి వాళ్ళూ వీళ్ళూ వస్తారు- మరి నువ్వెళ్ళు."

"స్టేషనుకొస్తాను."

"నేను వెళ్ళడం యివాళ కాదు, రేపు" అన్నది.

నేనొచ్చేశాను.

*　　*　　*　　*

ఆ మర్నాడు సాయంకాలం స్టేషన్‌కి వెళ్ళేటప్పటికి ఆలశ్యమైంది. నేను ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళగానే మెయిల్ కదిలింది. ఆమెను చూడ్డానికి వచ్చిన జనం తిరిగి వచ్చేస్తున్నారు. వారిలో అనూరాధ కూడా వుందీ నన్ను చూసి.

"నాకు మీరింకా సోడా తాలూకు అర్ధణా యివ్వాలి" అన్నదీ.

వెళ్ళిపోతున్న రైలు- గార్డుపెట్టి వెనుక ఎఱ్ఱదీపం మాయమైందీ. ★